TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354


హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-194 | పేజీలు:-4 | శనివారం 27-06-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## వెనెజువెలాకు భారత్ భారీ సాయం

'ఆపరేషన్ అమిస్తాద్' ప్రారంభం

- ★ఐఏఎఫ్‌కు చెందిన రెండు సీ-17 విమానాల్లో వైద్య సామగ్రి
- ★భీష్మ క్యూబ్‌లు, మందులు, 35 టన్నుల సహాయ సామగ్రి
- ★బయలుదేరిన 41 మంది వైద్య బృందం
- ★235కు చేరిన మృతుల సంఖ్య



వరుస భూకంపాలతో తీవ్రంగా నష్టపోయిన వెనెజువెలాకు భారత్ అండగా నిలిచింది. బాధితులకు అత్యవసర సాయం అందించేందుకు 'ఆపరేషన్ అమిస్తాద్' (స్పానిష్‌లో అమిస్తాద్ అంటే స్నేహం) పేరుతో ప్రత్యేక సహాయక - మిగతా 2 లో

## రాముడి పేరుతో మోసం సహించేది లేదు

- ❄రామమందిర విరాళాల దుర్వినియోగంపై స్పందించిన యోగి ఆదిత్యనాథ్
- ❄ఈ కేసులో జీరో టాలరెన్స్ విధానమే అమలు చేస్తామని స్పష్టీకరణ
- ❄సిట్ నివేదిక అందిన వెంటనే చర్యలు చేపట్టామని వెల్లడి
- ❄ప్రజల విశ్వాసంతో చెలగాటం ఆడేవారిని ఉపేక్షించబోమని హెచ్చరిక
- ❄విపక్షాలపైనా యోగి విమర్శలు



అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో నిందితులపై ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్ష చూపబోదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. సనాతన ధర్మం, ప్రజల విశ్వాసంతో చెలగాటం - మిగతా 2 లో

## 27 రోజుల జైలు నిర్బంధం తర్వాత



- కేటీఆర్‌ను కలిసిన బాల్క సుమన్
- సింగరేణిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేసు
- చంచల్‌గూడ జైల్లో 27 రోజులు ఉన్న బాల్క సుమన్
- బాల్క సుమన్‌కు ధైర్యం చెప్పిన కేటీఆర్

దాదాపు నెల రోజుల పాటు జైల్లో ఉన్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ - మిగతా 2 లో

## విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని మండిపాటు



- ➤అయోధ్య రామ జన్మభూమి విరాళాల సేకరణలో రూ. 200 కోట్ల అవినీతి జరిగింది: ఎంపీ చామల
- ➤యోగి ఆదిత్యనాథ్ సీఎం పదవికి రాజీనామా చేయాలని చామల డిమాండ్
- ➤మమత, ఠాకరేలకు చెందిన ఎంపీలను ఈ సొమ్ముతోనే కొనుగోలు చేశారని ఆరోపణ

అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల సేకరణలో ఏకంగా రూ. 200 కోట్ల భారీ అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ఎంపీ చామల - మిగతా 2 లో

## శైలజా రామయ్యర్‌కు స్థాన చలనం

- ▶▶తెలంగాణలో మరోసారి భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు
- ▶▶తెలంగాణలో మరోసారి అధికారుల పునర్వ్యవస్థీకరణ జరిగింది
- ▶▶పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం మరోసారి ఐఏఎస్ అధికారుల బదిలీ చేపట్టింది
- ▶▶13 ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది
- ▶▶ఎవరెవరికి ఎక్కడ పోస్టింగ్‌లు వచ్చాయో వివరాలు ఇలా ఉన్నాయి.




పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం మరోసారి అధికారులకు స్థాన చలనం కల్పించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మారిన రోజే ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కీలకమైన శాఖలకు సంబంధించిన అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం మారిన తర్వాత మరోసారి అధికారుల మార్పులు చేర్పులు జరిగాయి. 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ జరగ్గా ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

**దేవాదాయ శాఖ నుంచి బదిలీ**

తెలంగాణలో ఐఏఎస్ అధికారుల భారీ బదిలీలు జరిగాయి. 13 మంది ఐఏఎస్ అధికారులకు

## భారత్‌కు జపాన్ ప్రధాని జూలై 1 నుంచి పర్యటన



- జూలై 1 నుంచి 3 వరకు భారత్‌లో పర్యటించనున్న జపాన్ ప్రధాని
- ప్రధాని మోదీతో కలిసి 16వ వార్షిక సదస్సులో పాల్గొననున్న సనాయే తకాయిచి
- రెండు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, సాంకేతికతపై చర్చలు

భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో

## అయోధ్య విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం



- రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు దర్యాప్తు ముమ్మరం
- ఇప్పటికే ఎనిమిది మంది అరెస్ట్ చేసిన పోలీసులు
- ట్రస్ట్ చీఫ్ చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామా
- నిందితుల్లో చంపత్‌రాయ్ డ్రైవర్ రామశంకర్ యాదవ్

రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు దర్యాప్తు కొనసాగుతున్న వేళ

## 755 కోట్లతో బంగారు ఉంగరాల పథకం

- ▶▶తమిళనాడు ప్రభుత్వ నిర్ణయంపై మిశ్రమ స్పందన
- ▶▶తమిళనాడులో 'తైమామన్ తంగ మోదిరం' అనే కొత్త పథకం ప్రారంభం
- ▶▶ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు 1 గ్రాము బంగారు ఉంగరం బహూకరణ
- ▶▶ఏటా రూ. 755 కోట్ల వ్యయంతో 4.42 లక్షల మందికి లబ్ధి
- ▶▶పథకంపై ప్రజారోగ్య నిపుణుల నుంచి విమర్శలు, సూచనలు
- ▶▶సీఎం విజయ్ పుట్టినరోజు నుంచి జన్మించిన శిశువులకు ఈ పథకం వర్తింపు




తమిళనాడు ప్రభుత్వం ఒక వినూత్న సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన ప్రతి శిశువుకు 1 గ్రాము బంగారు ఉంగరాన్ని బహుమతిగా అందించనున్నట్లు ప్రకటించింది. తమిళ

## రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు

బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం



- ➤రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలే లక్ష్యంగా బీజేపీ విమర్శలు
- ➤'లాపతా రాహుల్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టర్లతో క్యాంపెయిన్
- ➤రాహుల్ టూర్ల ఖర్చుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కమలదళం
- ➤రాహుల్ ప్రపంచస్థాయి నాయకుడని కాంగ్రెస్ కౌంటర్

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తరచూ చేపడుతున్న విదేశీ పర్యటనలను లక్ష్యంగా

## విద్యావ్యవస్థలో మార్పు మీరే తేవాలి


ఉపాధ్యాయులకు మంత్రి లోకేశ్ దిశానిర్దేశం



- ❖సింగపూర్ యాత్రకు వెళ్లిన 37 మంది టీచర్లతో మంత్రి లోకేశ్ భేటీ
- ❖విద్యా వ్యవస్థలో మార్పునకు ఉపాధ్యాయులే నాయకత్వం వహించాలని పిలుపు
- ❖మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు గుర్తింపు ఇస్తామని హామీ
- ❖అందరం కలిసి 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' సాధిద్దామన్న లోకేశ్

రాష్ట్ర విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి ఉపాధ్యాయులే నాయకత్వం వహించాలని,

## జగన్ బంగీ జంప్ ఆ విషయం అడుగుతానన్న కేటీఆర్



- ★జగన్ బంగీ జంప్‌పై కేటీఆర్ సరదా వ్యాఖ్యలు
- ★బంగీ జంప్ అంటే తనకు భయమని వెల్లడి
- ★కలిసినప్పుడు జగన్‌ను అడుగుతానన్న కేటీఆర్
- ★కేసీఆర్ మౌనాన్ని గోడకు వేలాడుతున్న తుపాకీతో పోల్చిన కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి చేసిన

## మార్కాపురం జిల్లాకు సీఎం చంద్రబాబు షెడ్యూల్ ఇదే!

- ▶▶మార్కాపురం జిల్లాలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- ▶▶వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- ▶▶ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం చెక్కుల పంపిణీ, వారితో సమావేశం
- ▶▶గిద్దలూరులో సంజీవిని ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ▶▶సీఎం పర్యటన సందర్భంగా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం (జూన్ 2) మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన కీలకమైన వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించడంతో

## విద్యావ్యవస్థలో మార్పు మీరే తేవాలి







మొదటిపేజీ తరువాయి - అందరూ కలిసికట్టుగా కృషి చేసి 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను సాధించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లివచ్చిన 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులతో ఆయన ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, సింగపూర్ పర్యటనలో తాము తెలుసుకున్న అధునాతన విద్యా విధానాలు, బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో వాటిని అమలు చేయడానికి ఉన్న అవకాశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను లోకేశ్ ఆసక్తిగా విన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్రే అత్యంత కీలకమని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసి మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు ప్రభుత్వం తప్పకుండా గుర్తింపునిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యారంగాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

## జగన్ బంగీ జంప్.. ఆ విషయం అడుగుతానన్న కేటీఆర్

మొదటిపేజీ తరువాయి - సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. ఒక టెలివిజన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ, గతంలో జగన్ చేసిన బంగీ జంప్ గురించి ప్రస్తావించారు. తనకు సాహసకృత్యాలంటే ఇష్టమని, భవిష్యత్తులో స్కైడైవింగ్ చేయాలని ఉందని, అయితే బంగీ జంప్ అంటే మాత్రం ఎంతో భయమని ఆయన వెల్లడించారు. కేవలం ఒకే తాడుపై ఆధారపడి కిందకు దూకడం చాలా భయానకంగా అనిపిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే జగన్ చేసిన బంగీ జంప్ అంశాన్ని గుర్తుచేసుకుంటూ, “అది జగన్‌కు ఎలా సాధ్యమైందో నాకు అర్థం కావడం లేదు. ఆయన్ను కలిసినప్పుడు దీని గురించి తప్పకుండా అడుగుతాను” అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ప్యారాచూట్ సహాయంతో చేసే స్కై డైవింగ్ కంటే బంగీ జంప్ క్లిష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే ఇంటర్వ్యూలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవలి మౌనంపై కూడా కేటీఆర్ స్పందించారు. కేసీఆర్ మౌనాన్ని “గోడకు వేలాడుతున్న తుపాకీ”తో ఆయన పోల్చారు. సమయం వచ్చినప్పుడు అది తప్పకుండా గర్జిస్తుందని, ప్రస్తుతం ఆయన మార్గదర్శకత్వంలోనే తామంతా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ప్రతి సందర్భంలోనూ నాయకుడు ముందుండాల్సిన అవసరం లేదని, అసలైన నాయకుడు వెనుక ఉండి నడిపిస్తారని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మార్కాపురం జిల్లాకు సీఎం చంద్రబాబు షెడ్యూల్ ఇదే!

మొదటిపేజీ తరువాయి - పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. వివరాల్లోకి వెళితే, శనివారం ఉదయం 9:55 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం చంద్రబాబు, 10:45 గంటలకు మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె గ్రామానికి చేరుకుంటారు. అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులతో కొద్దిసేపు సమావేశమైన అనంతరం, ఉదయం 11 గంటలకు వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. పనుల పురోగతి, నాణ్యతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆయన పరిహారం చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12:20 వరకు నిర్వాసితులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12:55 గంటలకు గిద్దలూరు నియోజకవర్గంలోని కిష్టంశెట్టిపల్లె గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన సంజీవిని ఆసుపత్రిని ప్రారంభించి, వైద్యులు, సిబ్బందితో సమావేశమవుతారు. ఆసుపత్రి ప్రారంభోత్సవం అనంతరం జరిగే బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఆ తర్వాత స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో 'గార్డెన్ మీటింగ్'లో పాల్గొని అభివృద్ధి అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం 5:15 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో గుంటూరుకు తిరుగుపయనమవుతారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## 27 రోజుల జైలు నిర్బంధం తర్వాత

మొదటిపేజీ తరువాయి - గురువారం సాయంత్రం చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈరోజు ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సింగరేణి బొగ్గు గనులకు సంబంధించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలోనే ఆయనను అరెస్ట్ చేశారు. ఈ కేసుల వల్ల ఆయన ఏకంగా 27 రోజుల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. కేటీఆర్‌ను కలిసిన సందర్భంగా... తన జైలు అనుభవాలు, తదుపరి న్యాయపోరాటం గురించి చర్చించారు. ఈ కష్టకాలంలో పార్టీ తనకు అండగా నిలిచినందుకు కేటీఆర్‌కు థాంక్స్ చెప్పారు. బాల్క సుమన్‌ను కేటీఆర్ ఆత్మీయంగా హత్తుకుని, ధైర్యం చెప్పారు.

## విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని మండిపాటు



మొదటిపేజీ తరువాయి - కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రస్ట్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పినప్పటికీ... యూపీ సిట్ పోలీసులు ఆయన సొంత మనుషులనే అరెస్ట్ చేశారని తెలిపారు. కేవలం చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను పదవుల నుంచి తప్పించి బీజేపీ చేతులు దులుపుకుంటే సరిపోదని, ఈ స్కామ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని, దేవుడి కోసం సేకరించిన విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని చామల మండిపడ్డారు. బెంగాల్‌లో మమతా బెనర్జీకి చెందిన 20 మంది ఎంపీలను, మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రేకు చెందిన ఆరుగురు ఎంపీలను ఒక్కొక్కరికీ రూ. 75 కోట్లు ఇచ్చి కొనుగోలు చేయడానికి ఈ రాముడి సొమ్మునే వాడారంటూ తీవ్రస్థాయిలో ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని... ఇప్పుడు చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను కేవలం పదవుల నుంచి తప్పిస్తే సరిపోదని అన్నారు.

# శైలజా రామయ్యర్‌కు స్థాన చలనం

మొదటిపేజీ తరువాయి - కొత్త పోస్టింగులు ప్రభుత్వం ఇచ్చింది. జీఓ ఆర్‌టీ నంబర్ 914ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్ శ్రీధర్ నియమితులవగా.. దేవాదాయ శాఖ నుంచి ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖకు శైలజా రామయ్యర్ బదిలీ అయ్యారు. ఇక పొలిటికల్ జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీగా అహ్మద్ నదీమ్ పోస్టింగ్ లభించింది.

### రాహుల్ బొజ్జాకు స్థాన చలనం

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జా నియామకం కాగా.. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా అజిత్ రెడ్డిని తెలంగాణ ప్రభుత్వం నియమించింది. టీజీఆర్ఈడీసీఓ వీసీ, ఎండీగా ముషర్రఫ్ అలీ ఫారూఖీకి అదనపు బాధ్యతలు అప్పగించింది. హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ స్పెషల్ సీఎస్‌గా పి. కాత్యాయిని దేవి నియమితులవగా.. టీజీఆర్ఈఆర్ఏ ఈడీ కె. గంగాధర్‌కు ఆర్ అండ్ బీ శాఖలో పోస్టింగ్ లభించింది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా టి. వెంకన్న బదిలీ కాగా.. టూరిజం డైరెక్టర్‌గా కె. విద్యాసాగర్ నియామకం అయ్యారు. హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా కే. చంద్రకళకు ఎఫ్ఏసీ బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది.

### అదనపు బాధ్యతలు

మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యదర్శిగా ఎం. రఘునందన్ రావుకు పూర్తి అదనపు బాధ్యతలు ప్రభుత్వం అప్పగించగా.. టీజీ ట్రాన్స్‌కో వీసీ,ఎండీగా ముషారఫ్ అలీ ఫరూఖీకి ఎఫ్ఏసీ బాధ్యతలు ప్రభుత్వం ఇచ్చింది. ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా విద్యాసాగర్‌కు అదనపు బాధ్యతలు ఇవ్వగా.. శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళకు హెచ్ఎండీఏలో ఎఫ్ఏసీ బాధ్యతలు ఇచ్చింది. కొత్త ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా నియమితులైన సంజయ్ జాజుకి అదనపు బాధ్యతల కొనసాగింపుపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పరిశ్రమలు, వాణిజ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలు సంజయ్ జాజుకే సీఎస్‌గా అవకాశం ఇచ్చింది. ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ అదనపు బాధ్యతలు కొనసాగించింది. ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈఓగా కూడా సంజయ్ జాజు కొనసాగనున్నారు. స్పీడ్ వ్యవస్థ బాధ్యతలు కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్దే ఉన్నాయి.

# భారత్‌కు జపాన్ ప్రధాని జూలై 1 నుంచి పర్యటన

మొదటిపేజీ తరువాయి - చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు జపాన్ ప్రధాన సనాయే తకాయిచి జులై 1 నుంచి 3వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పర్యటనలో భాగంగా ఢిల్లీలో నిర్వహించనున్న 16వ భారత్-జపాన్ వార్షిక సదస్సులో ఇరు దేశాల ప్రధానులు పాల్గొంటారు. జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సనాయే తకాయిచి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. వాస్తవానికి, ఈశాన్య రాష్ట్రాల్లో జపాన్ చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు చిహ్నంగా ఈ సదస్సును గౌహతిలో నిర్వహించాలని తొలుత భావించారు. అయితే, ప్రధాని తకాయిచి పర్యటన షెడ్యూల్ మరియు ఇతర లాజిస్టికల్ కారణాల రీత్యా వేదికను ఢిల్లీకి మార్చినట్లు అధికారులు వెల్లడించారు. గత ఏడాది టోక్యోలో జరిగిన 15వ సదస్సుకు కొనసాగింపుగా ఈ సమావేశం జరగనుంది. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత మరియు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వం వంటి అంశాలపై ఇరు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంపై నేతలు చర్చించనున్నారు. ముఖ్యంగా ఆర్థిక భద్రత, కీలక ఖనిజాలు, ఇంధన సరఫరా వ్యవస్థల బలోపేతం మరియు రక్షణ రంగ సహకారం వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉండే అవకాశం ఉంది.

# రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు

మొదటిపేజీ తరువాయి - లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ మేరకు 'మిస్సింగ్ రాహుల్ (లాపతా రాహుల్)' పేరుతో సరికొత్త పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయన పర్యటనల కోసం చేస్తున్న ఖర్చులపై ప్రశ్నలు సంధిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఈ క్యాంపెయిన్‌ను ఉద్ధృతం చేసింది. ఈ ప్రచారంలో భాగంగా పలు సినిమా పోస్టర్లను మార్ఫింగ్ చేస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. “ఛడ్ దే ఇండియా”, “రాహుల్ ఇన్ పారిస్”, “పరదేశ్” వంటి పేర్లతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను 'పర్యటనల నేత'గా మార్చాలని కొందరు బీజేపీ అధికార ప్రతినిధులు ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ యూనిట్ “స్వదేశ్ వర్సెస్ పరదేశ్” పేరుతో పోస్టర్ విడుదల చేయగా, గోవా బీజేపీ రాహుల్ గాంధీ థాయ్‌లాండ్‌లో విహారయాత్ర చేస్తున్నారా? అంటూ ప్రశ్నించింది. బీజేపీ నేతలు షెహజాద్ పూనావాలా, ఆర్పీ సింగ్ వంటి వారు రాహుల్ పర్యటనల ఖర్చు, పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు సుమారు 55 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, వీటికి దాదాపు రూ.60 కోట్లకు పైగా ఖర్చయి ఉండవచ్చని వారు అంచనా వేశారు. ఆయన వెల్లడించిన ఆదాయానికి, ఈ పర్యటనల ఖర్చులకు ఏమాత్రం పొంతన లేదని, ఈ పర్యటనలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే, బీజేపీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ అంతే ధీటుగా తిప్పికొట్టింది. రాహుల్ గాంధీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఆహ్వానాలు అందుతుంటాయని పేర్కొంది. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రేరేపిత ఆరోపణలని కొట్టిపారేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ ఈ విషయంపై స్పందిస్తూ, “రాహుల్ గాంధీ కేవలం మన దేశ నాయకుడే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆయన్ను గొప్ప నాయకుడిగా భావిస్తారు. అందుకే వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆయనకు నిరంతరం ఆహ్వానాలు వస్తుంటాయి” అని స్పష్టం చేశారు.

## వెనెజువెలాకు భారత్ భారీ సాయం

మొదటిపేజీ తరువాయి - బాధితులకు అత్యవసర సాయం అందించేందుకు 'ఆపరేషన్ అమిస్తాద్' (స్పానిష్‌లో అమిస్తాద్ అంటే స్నేహం) పేరుతో ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది. ఈ మేరకు భారత వైమానిక దళానికి చెందిన రెండు సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానాల్లో వైద్య బృందం, భీష్మ క్యూబ్‌లు, మందులు, ఇతర సహాయ సామగ్రిని పంపింది. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. వెనెజువెలా ప్రజలకు ఈ క్లిష్ట సమయంలో భారత్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సహాయక బృందంలో 60 పారా ఫీల్డ్ హాస్పిటల్‌కు చెందిన 41 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది వైద్యులు ఉన్నారు. అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు, ఇతర ఆరోగ్య సేవలు అందించేందుకు వీరు సిద్ధంగా ఉన్నారు. విదేశాంగ శాఖ అందించిన సుమారు ఆరు టన్నుల వైద్య సామగ్రి కూడా వెంట తీసుకెళ్లారు. అలాగే ఆరోగ్య మైత్రి ప్రాజెక్టు కింద రూపొందించిన రెండు భీష్మ క్యూబ్‌లను కూడా పంపించారు. ఇవి విపత్తుల సమయంలో తాత్కాలిక ఆసుపత్రులుగా ఉపయోగపడే ఆధునిక వైద్య యూనిట్లు. వెనెజువెలాలో బుధవారం నిమిషం వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో ఇప్పటివరకు 235 మంది మృతి చెందారు. 1,500 మందికిపైగా గాయపడ్డారు. వేలాది మంది ఇంకా గల్లంతైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. రాజధాని కరాకస్, లా గువైరా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా, బ్రెజిల్, మెక్సికో, అర్జెంటీనా తదితర దేశాలు కూడా సాయాన్ని ప్రకటించాయి.

## రాముడి పేరుతో మోసం సహించేది లేదు

మొదటిపేజీ తరువాయి - ఆడేవారిపై జీరో టాలరెన్స్ విధానమే అమలు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని యోగి తెలిపారు. “అయోధ్య విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని ముందే చెప్పాం. విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం” అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విపక్షాలపై కూడా యోగి తీవ్ర విమర్శలు చేశారు. “ఒకప్పుడు శ్రీరాముడు లేడని చెప్పినవారే ఇప్పుడు భక్తి గురించి మాట్లాడుతున్నారు. రామమందిర నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కోర్టుల్లో పోరాడినవాళ్లే ఇప్పుడు విశ్వాసం గురించి మాట్లాడటం విచిత్రం” అని వ్యాఖ్యానించారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో ఇప్పటికే ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆలయ విరాళాల నగదు నిర్వహణ, ఉద్యోగుల నియామకాలు, సీసీటీవీ పర్యవేక్షణ, బంగారం, వెండి వంటి కానుకల నిర్వహణలో పలు అవకతవకలు జరిగినట్లు సిట్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## తుంగభద్ర జలాలు: రేవంత్ సర్కార్‌పై రాంచందర్ రావు ఫైర్

**తుంగభద్ర నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలన్న బీజేపీ**

**తెలంగాణకు రావాల్సిన నీటిలో భారీగా కోత పడుతోందన్న రామచందర్ రావు**

**సర్ ప్రక్రియపై అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యల మీద విమర్శ**




తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టతనివ్వాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో జరిగిన చర్చల్లో ఏయే అంశాలను ప్రస్తావించారో వివరాలను బహిర్గతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర డ్యామ్‌కు ఇటీవల 33 కొత్త స్పిల్‌వే గేట్లను అమర్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ముఖ్యమంత్రులతో పాటు కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ హాజరయ్యారు. గేట్ల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే తెలంగాణకు దక్కాల్సిన నీటి కేటాయింపులపై కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని రామచంద్రరావు సూచించారు. రెండు కీలక ప్రాజెక్టుల కింద తెలంగాణకు 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, అధికారిక లెక్కల ప్రకారం కేవలం 5 టీఎంసీలు మాత్రమే అందుతున్నాయని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి దక్కాల్సిన వాటా కంటే తక్కువ నీటికి గతంలో కేసీఆర్ సంతకం చేశారని ఆయన ఆరోపించారు. 'సర్' ప్రక్రియపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను రామచందర్ రావు తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఐడీ కార్డు ఉంటేనే 'ఎస్ఐఆర్' చెల్లుతుందా? పాస్‌పోర్ట్ చెల్లదా? అని ఒవైసీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. పాస్‌పోర్ట్ అనేది ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని, అది పౌరసత్వానికి నిరూపణ కాదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా గుర్తు చేశారు. దలైలామా వద్ద కూడా ఎల్లో పాస్‌పోర్ట్ ఉందని, అంతమాత్రాన ఆయనకు భారత పౌరసత్వం ఉన్నట్లు కాదని పేర్కొన్నారు. 'సర్' ప్రక్రియలో గుర్తింపు కోసం 12 రకాల ధృవీకరణ పత్రాలను సమర్పించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## అయోధ్య విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం

మొదటిపేజీ తరువాయి - శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ట్రస్ట్ చీఫ్ చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ కేసులో ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేసిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అరెస్టైన వారిలో నగదు లెక్కింపు సిబ్బంది, లెక్కింపు ప్రక్రియ ఇన్‌ఛార్జి, పర్యవేక్షించిన రిటైర్డ్ బ్యాంకర్‌తో పాటు చంపత్‌రాయ్ డ్రైవర్, సన్నిహితుడు రామశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ కూడా ఉన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదిక ఆధారంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అనంతరం శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితులపై చోరీ, నమ్మకద్రోహం, మోసం, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## 755 కోట్లతో బంగారు ఉంగరాల పథకం



మొదటిపేజీ తరువాయి - సంస్కృతిలో మేనమామ సారె పెట్టే సంప్రదాయాన్ని స్ఫూర్తిగా తీసుకుని, 'తైమామన్ తంగ మోదిరం తిట్టం' (మేనమామ బంగారు ఉంగరం పథకం) పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకం కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ. 755.83 కోట్లు ఖర్చు చేయనుంది. దీని ద్వారా సంవత్సరానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే దాదాపు 4.42 లక్షల మంది శిశువులు లబ్ధి పొందనున్నారు. ముఖ్యమంత్రి విజయ్ పుట్టినరోజైన జూన్ 22, 2026 నుంచి జన్మించిన పిల్లలందరికీ ఈ పథకం వర్తిస్తుంది. పెరరిజ్ఞర్ అన్నా జయంతి సందర్భంగా సెప్టెంబర్ 15, 2026న ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. పారదర్శకమైన కొనుగోళ్ల కోసం వెంటనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని తమిళనాడు మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ (ఎ౦చీమీాజ) అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఇటీవలి ఎన్నికల్లో అధికార తమిళగ వెట్రి కజగం (౨ఎఖ) ఇచ్చిన హామీని నెరవేర్చడంలో భాగంగా ఈ పథకాన్ని తీసుకొచ్చారు. దీని ద్వారా కుటుంబాలకు అండగా నిలవడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడం, సాంస్కృతిక సంప్రదాయాలను గౌరవించడం వంటి లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతున్న డాక్టర్ ముత్తులక్ష్మి రెడ్డి మెటర్నిటీ బెనిఫిట్ స్కీమ్‌కు ఈ పథకం అదనపు బలాన్ని చేకూర్చనుంది.

### నిపుణుల నుంచి భిన్నాభిప్రాయాలు

ఈ పథకంపై ఆరోగ్య రంగ నిపుణులు, ప్రతిపక్షాలతో పాటు అధికార కూటమిలోని మిత్రపక్షం నుంచే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో నిధులను ఉంగరాల కోసం ఖర్చు చేయడం కంటే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపరచడానికి ఉపయోగించాలని పలువురు సూచిస్తున్నారు. ముఖ్యంగా మిత్రపక్షమైన వీసీకే పార్టీ అధినేత, ఎంపీ తోల్. తిరుమావళవన్ ఈ పథకాన్ని పునఃపరిశీలించాలని ముఖ్యమంత్రి విజయ్‌కు విజ్ఞప్తి చేశారు. 'ది హిందూ' కథనం ప్రకారం, రూ.756 కోట్లతో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి వార్డులను ఆధునికీకరించవచ్చని, అవసరమైన సిబ్బందిని నియమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల కొరత, భద్రతా కారణాల వల్లే 44% కుటుంబాలు అప్పులు చేసి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. మందులు కొనుగోలు చేయాల్సిన తమిళనాడు మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ (ఎ౦చీమీాజ) ఇప్పుడు బంగారం కొనడం ఎంతవరకు సమంజసమని ఓ ప్రభుత్వ అధికారి ప్రశ్నించారు. అయితే, ఈ పథకాన్ని ప్రజారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ కె. కొలందస్వామి సమర్థించారు. దీనివల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగి, ప్రైవేటు రంగంలో అధికంగా ఉన్న సిజేరియన్ల రేటు తగ్గే అవకాశం ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వం మాత్రం పథకం అమలుకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించి ముందుకు సాగుతోంది. దీంతో ఈ పథకం ఉద్దేశం, ప్రాధాన్యతలపై రాష్ట్రంలో విస్తృత చర్చ జరుగుతోంది.

నిజం దృష్టి తెలుగు న్యూస్
శనివారం 27-06-2026

# జర్నలిస్టులకు అక్రిడేషన్లు నిబంధనలకు తావు లేకుండా అందించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి మూర్తి డిమాండ్...

మెండోరా మండల **జూన్ 26 నిజం న్యూస్:** గతంలో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత ఏ.పీ. సీఎం. చంద్రబాబు నాయుడు ప్రభుత్వల హయాంలో మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియాలలో, ఎలక్ట్రానిక్ మీడియాలలో విధులు నిర్వహిస్తున్న ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి నిబంధనలకు తావు లేకుండా ప్రతి ఒక్క జర్నలిస్టుకు నేరుగా అక్రిడేషన్ లు అందించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎలాంటి వేతనం లేకుండా నిరంతరం ప్రజలకు- ప్రభుత్వానికి వారధిగా వార్తలు సేకరిస్తూ, కథనాలు రాస్తూ ప్రజలకు అందిస్తున్న ఘనత జర్నలిస్టుల దేనని ఆయన అన్నారు. జర్నలిస్టుల వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది అన్నారు. ప్రజల,ప్రభుత్వాల మంచి, చెడు వార్తలను సేకరించి, అటు ప్రభుత్వాన్ని ఇటు ప్రజలను చైతన్యం చేస్తుంది జర్నలిస్టులేనని, ప్రభుత్వ పథకాలను సైతం ప్రజలకు సమాచారం అందించేలా కృషి చేస్తుంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు లేనని ఆయన కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల గడిచినప్పటికీ, ప్రభుత్వం సర్కులేషన్ పేరుతో, ఆర్ ఎన్ ఐ పేరుతో, వివిధ రకాల నిబంధనలు విధిస్తూ అక్రిడేషన్లు అందించకపోవడం సబబు కాదన్నారు. గతంలో జిల్లాలో అగ్నిపూలు పత్రిక, కబురు పత్రిక లాంటి వాటికి కూడా అక్రిడేషన్ లు గత ప్రభుత్వాలు అందించాయన్నారు. అక్రిడేషన్లతోపాటు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇండ్ల నిర్మాణాలకు రుణాలు అందించి ప్రభుత్వం అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించాలన్నారు. జర్నలిజంలో అధిక శాతం ఓబీసీలు ఉన్నారని, ఓబీసీలు ఉండడంవల్లే ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందా అనే అనుమానాలు కలుగుతున్నాయని, వెంటనే అలాంటి అనుమానాలు కలగకుండా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు లేని ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ల తో పాటు అన్ని సౌకర్యాలు అందించి కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు దాసరి మూర్తి ప్రభుత్వాన్ని కోరారు.




# సర్ సర్వేలో రాజ్యాంగం కల్పించిన ఓటర్ల హక్కులకు భంగం కలిగించొద్దు

మ్యాపింగ్ కానీ ఓటర్లకు మరో అవకాశం ఇవ్వాలి

నర్సంపేట గ్రీన్ ల్యాండ్ స్థలాలను భూ కబ్జాదారుల నుంచి కాపాడాలి

ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

**జూన్ 26 నిజం న్యూస్:** జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన ఎంసిపిఐ(యు) జిల్లా ప్రతినిధి బృందం జిల్లాలో మ్యాపింగ్ కానీ ఓటర్లకు మరో అవకాశం కలిపించి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. అలాగే ఆక్రమణకు గురవుతున్న నర్సంపేట గ్రీన్ ల్యాండ్స్ భూములను రక్షించి అభివృద్ధి పరచాలని కోరారు. ఈరోజు ఎంసీపీఐ(యు) వరంగల్ జిల్లా ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారద గారిని కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటర్ల సవరణలో భాగంగా మ్యాపింగ్ కానీ సుమారు 20 శాతం ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా మరోసారి అవకాశం కలిపించి ఓటు హక్కును కాపాడుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ క్రమంలో ఎంసిపిఐ(యు) ప్రతినిధులను బూతు లెవెల్ ఏజెంట్లుగా నియమించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కుంటి సాకులతో అర్హులైన ఓటర్లను తొలగించకుండా సర్వే పారదర్శకంగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.




నర్సంపేట గ్రీన్ ల్యాండ్స్ కాపాడండి

జిల్లాలోని నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో సుమారు 40 ప్రదేశాలలో ఉన్న గ్రీన్ ల్యాండ్ అంగ అర్ధ అధికార బలం కలిగిన వ్యక్తులు ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన స్థానిక మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని దాంతో గ్రీన్ ల్యాండ్స్ అన్యాక్రాంతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని కాకతీయ కళాశాల పక్కనే ఉన్న 30 గుంటల గ్రీన్ ల్యాండ్ కొంతమంది సామాజిక బలం కలిగిన వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకునే నాధుడే కరువయ్యాడని అలాగే వివిధ ప్రభుత్వం అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మీడియా గగ్గోలు పెడుతున్న కనీస చర్యలు లేవన్నారు. కానీ పేదలు తలదాచుకోవడానికి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే మాత్రం కేసులు పెట్టి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే నర్సంపేట గ్రీన్ ల్యాండ్స్ కు హద్దులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రకృతి వనాలు ఆట స్థలాలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు లేకపోతే గ్రీన్ ల్యాండ్స్ ఇతర ప్రభుత్వ స్థలాల రక్షణకు పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కన్నం వెంకన్న మంద రవి జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ నగర కార్యదర్శి మాలోతు సాగర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుంచు జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ 6 గ్యారెంటీలను ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ వంచనపై బొబ్బా నవత రెడ్డి తీవ్ర ధ్వజం

రూ.300 చౌకబారు చీరలతో ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారు

**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూన్ 26:** ఆరు గ్యారెంటీల అమలు సున్నా.. కోటి మందిని కోటీశ్వరుల వాగ్దానం పెద్ద సున్నా.. చందానగర్‌లో సీఎంసీ మహిళా భవనం స్థలం కబ్జాపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి. నెల రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు, అత్తకి 4000 పెన్షన్,కోడలికి 2500 మహాలక్ష్మి స్కీం, తులం బంగారం, విద్యార్థులకు స్కూటీ లు, పెన్షన్లు ఇవ్వలని మహిళా అల్టిమేటం ఎన్నికల వేళ మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ,6 గ్యారెంటీలని అడ్డగోలు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, గత మూడు సంవత్సరాలుగా మహిళా లోకాన్ని ఘోరంగా వంచించిందని ,మాజీ కార్పొరేటర్ బొబ్బానవత రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**300 రూ చీరల పంపిణీతో మహిళలకు అవమానం:** మహిళా సాధికారత అంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పాలకులు, అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత నేడు ఆడబిడ్డలకు పంపిణీ చేస్తున్న చీరల విలువ కేవలం రూ. 300 మాత్రమేనని బొబ్బానవత ఆరోపించారు. ఈ అరకొర సాయాన్ని కూడా తమ సొంత ప్రచార ఆర్భాటాలకు వాడుకుంటూ, లబ్ధిదారులైన మహిళలను బలవంతంగా ఐరిస్ పరీక్షలు చేస్తూ భుజం మీద చీర వేసి మహిళలను బలవంతంగా ఫోటోలు దిగాలంటూ వేధించడం మహిళల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని ఆమె మండిపడ్డారు.

**ఆరు గ్యారెంటీల అమలులో ఘోర వైఫల్యం**

ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా తుంగలో తొక్కిందని బొబ్బానవత విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి ఇంట్లో అత్తకు రూ. 4,000, కోడలికి రూ. 2,500 ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం, కాలేజీ విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, వృద్ధులకు పెంచిన పెన్షన్ల ఊసే లేదని, హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసి కేవలం 300 రూ చీర బలవంతంగా భుజం మీద వేసి ఫోటో తీయడంతో మహిళలు కోటీశ్వరుల అవుతారా?అని ఆమె దుయ్యబట్టారు.



**చందానగర్ మహిళా భవనం స్థలం కబ్జా విషయంలో ప్రజాప్రతినిధుల హస్తం లేదా?**

చందానగర్ డివిజన్ కైలాష్ నగర్ కాలనీ లో గత ప్రభుత్వం మహిళల సంక్షేమం,అభివృద్ధి వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా కేటాయించిన 4,000 గజాల విలువైన జవీజ ప్రభుత్వ భూమిని నేడు విద్యుత్ శాఖ (కరెంట్ డిపార్ట్‌మెంట్) అక్రమంగా ఆక్రమించుకుందని బొబ్బానవత ఆరోపించారు. మహిళలకు దక్కాల్సిన ఆస్తిని కరెంట్ శాఖ కబ్జా చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే ఎందుకు వారికి వంతపాడుతున్నారు అని,మహిళలకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు అని, మహిళ భవనాలు నిర్మిస్తాను అని ఎన్నికల ముందు మీరు ఇచ్చిన కోటి రూపాయల చెక్కు ఏమైందని?మహిళ సంఘాలను మోసం చేసిన విషయం నిజంకదా అని నవత రెడ్డి ప్రశ్నించారు. మహిళలకు దక్కాల్సిన మహిళ భవనం భూమి తిరిగి మహిళలకు ఇవ్వకుంటే మహిళలతో కలిసి న్యాయ పోరాటం చేస్తాం అని,రాబోయే రోజుల్లో మహిళలు బుద్ది చెబుతారు అని హెచ్చరిక..మహిళలకు జరిగిన మోసంని శేరిలింగంపల్లి నియోజకవర్గ మహిళలందరు ముక్త కంఠం తో కండించి,రాబోయే ఎన్నికల్లో మహిళలందరు కలిసి బుద్ది చెబుతారు.

డ్వాక్రా మహిళలతో పాటూ అర్హులైన మహిళలందరికి చీరలు పంపిణీ చేయాలి ప్రభుత్వానికి బొబ్బానవత హెచ్చరిక అల్టిమేటం:

రాబోయే నెల రోజుల్లోగా డ్వాక్రా మహిళలతో పాటు అర్హులైన నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేయాలని, ఇందిరమ్మ ఇళ్లను తక్షణమే కేటాయించాలని, పెళ్లి కానుకగా తులం బంగారం, మహాలక్ష్మి పెన్షన్లు మరియు విద్యార్థులకు స్కూటీలు,ఇతర 6 గరంటీల హామీలన్నింటినీ యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని బొబ్బానవత డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఈ నెల రోజుల గడువులోగా స్పందించని పక్షంలో, నియోజకవర్గవ్యాప్తంగా మహిళా శ్రేణులను ఏకం చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక ప్రజాప్రతినిధులపై పెద్దఎత్తున ప్రత్యక్ష ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఆమె హెచ్చరించారు.

# డ్రగ్స్ పై అవగాహన ర్యాలీని నిర్వహించిన కేపిహెచ్బి పోలీసులు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 26:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం -- 2026 సందర్భంగా కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ నగర్ నుండి నిజాంపేట్ మెయిన్ రోడ్ వరకు డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఇనుమాటిక్స్ ాా× కోచింగ్ సెంటర్ వారి సహకారంతో నిర్వహించగా, సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీలో "మత్తు వద్దు... మంచి భవిష్యత్తు ముద్దు!", "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి అవును చెప్పండి, మత్తు రహిత భవిష్యత్తును ఎంచుకోండి" అనే సందేశాలతో ప్రజల్లో అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ాాూ గారు, ఐ× గారు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై నాయకులు అప్రమత్తంగా ఉండాలి: కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 26:** సర్ కార్యక్రమం నిర్వహణపై పై పార్టీ నాయకులు బ్లాక్ అధ్యక్షులు డివిజన్ అధ్యక్షులు మహిళా బ్లాక్ అధ్యక్షరాలు డివిజన్ మహిళా అధ్యక్షురాలతో శుక్రవారం కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమదుర్గాభవన్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హాజరై పార్టీ నాయకులకు సలహాలు సూచనలు అందజేశారు. ఓటర్ల జాబితా సవరణలో నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని నమోదు విషయంలో నాయకులు ఓటర్లకు సహకరించాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకుల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మీ మీ డివిజన్ల లో ప్రతి వ్యక్తి ఓటు నమోదయ్యేలా చూడాలని సూచించారు.

# నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ అధికారుల నిర్లక్షనికి బలైతున్న స్థానిక ప్రజలు

సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్.

**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 26:** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ డివిజన్ ఇంద్రన్న కాలనీలో గత వారం రోజులుగా డ్రైనేజ్ పొంగి ప్రవహిస్తున్న ఎన్ని సార్లు మున్సిపల్ అధికారులకు, సిబ్బందికీ పిర్యాదు చేసిన కనీసం అటు వైపు చూడడం లేదు సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ఎక్కడ చూసిన డ్రైనేజ్ మ్యానువాలు పొంగుతున్నాయి అని అన్నారు. ముఖ్యంగా ప్రగతి నగర్ డివిజన్ ఇంద్రన్న కాలనీలో గత వారం రోజులుగా మ్యానువాల్ పొంగి పోరులుతున్న మున్సిపల్ అధికారులు గాని, సిబ్బంది గాని ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు అని అన్నారు. ముఖ్యంగా నిజాంపేట్ సర్కిల్లో శానిటేషన్ అధికారులకు, ఇంజనీరింగ్ అధికారులకు సమన్వయం లేకపోవడం అలాగే మున్సిపల్ అధికారులకు వాటర్ బోర్డు అధికారులకు సమన్వయం లేకపోవడం చాలా బాధకారం కనుక వెంటనే పై సమస్యను పరిష్కరించాలని అని వారు హేచ్చరించారు.




# పార్కింగ్, కాలేజీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లేని అనంత లా కాలేజ్ పై చర్యలు తీసుకోవాలి:- రాకేష్ యాదవ్







**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 26:** పార్కింగ్ సౌకర్యం లేకుండా, కాలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ సెల్లార్లు లో ఏర్పాటుచేసిన అనంత లా కాలేజ్ పై చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ కు వినతి పత్రం అందజేసిన ఎన్ ఐ సి ఐ రాష్ట్ర నాయకులు రాకేష్ యాదవ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని లా కాలేజీలలో ఎలాంటి పార్కింగ్ సౌకర్యం, ఇన్ఫ్రాస్ట్రక్చర్, అడ్మినిస్ట్రేటివ్ సరిగా లేని లా కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కూకట్పల్లి అనంత లా కాలేజీలో పార్కింగ్ సదుపాయం లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులకు గురి అవుతున్నారని, అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం కూడా సెల్లార్ లో ఏర్పాటు చేయడం అభ్యంతరం తెలిపారు. నివాస గృహాలకు ఏర్పాటు చేసుకున్న అపార్ట్మెంట్లో కాలేజీ ఏర్పాటు చేయడం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# డ్రగ్స్ పై అవగాహన ర్యాలీని నిర్వహించిన కేపిహెచ్బి పోలీసులు

**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 26:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం -- 2026 సందర్భంగా కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ నగర్ నుండి నిజాంపేట్ మెయిన్ రోడ్ వరకు డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఇనుమాటిక్స్ ాా× కోచింగ్ సెంటర్ వారి సహకారంతో నిర్వహించగా, సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీలో "మత్తు వద్దు... మంచి భవిష్యత్తు ముద్దు!", "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి అవును చెప్పండి, మత్తు రహిత భవిష్యత్తును ఎంచుకోండి" అనే సందేశాలతో ప్రజల్లో అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ాాూ గారు, ఐ× గారు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు అండగా ఎల్లప్పుడూ బీజేపీ ఉంటుంది...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూన్ 26:** శుక్రవారం మసీద్ బండ బీజేపీ కార్యాలయంలో శ్రీ సాయి మేస్త్రి సంఘం అధ్యక్షులు, సంఘ సభ్యులు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి కార్మికులకు అండగా ఉండాలని కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సాయి మేస్త్రి సంఘం ఏర్పాటు చేయడం పై సంతోషం వ్యక్తం చేశారు, నియోజకవవర్గంలో అందరిని కలిసి అందరూ ఒక్కటి గా ఉండాలని సూచించారు, కేంద్ర ప్రభుత్వ ఈ శ్రమ్ కార్డులు పొందడం ద్వారా 2 లక్షల వరకు ప్రమాద బీమా పొందవచ్చని, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన సంవత్సరానికి 436 కడితే మరణించిన తదనంతరం కుటుంబం లోని నామినీకి 2 లక్షల రూపాయలు అందుతాయన్నారు. అలాగే ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన ద్వారా సంవత్సరానికి 20 రూపాయలు కడితే ప్రమాదవశాత్తూ చనిపోయిన, శాశ్వత అంగవైలక్యం వచ్చిన బీమా డబ్బులు వస్తాయని తెలియజేస్తూ ఇలా అన్ని పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూసుకుంటామని హామీ ఇచ్చారు, మీకు ఎల్లపుడు అందుబాటులో ఉంటామని ఏ కష్టం వచ్చిన భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందన్నారు, ఈ కార్యక్రమంలో మాదాపూర్ కంటేస్టేడ్ కార్పొరేటర్ రాధాకృష్ణ యాదవ్, సంఘం అధ్యక్షులు విశ్వేశ్వర్ రావు, పూర్ణ, దీపాల కొండయ్య, రోశయ్య, వెంకటేశ్వర్లు, అంకమ్మరావు, సామ్యులు మరియు ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
శనివారం 27-06-2026

## ఆ వందే భారత్‌లో కీలక మార్పులు

## ఇప్పుడు 8 కోచ్‌లకు బదులుగా 20 కోచ్‌లు




వందేభారత్ ఎక్స్‌ప్రెస్ విషయంలో రైల్వే కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విధంగా అదనపు కోచ్‌లను జోడిస్తోంది. ఇక్కడ రైల్వే మార్గంలో 8 కోచ్‌లు మాత్రమే ఉన్న వందే భారత్‌కు ఏకంగా 20 కోచ్‌ల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పుడు.. పెరుగుతున్న ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా, ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరిచేందుకు జోధ్‌పూర్-ఢిల్లీ కంటోన్మెంట్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను అధిక సామర్థ్యం గల రైలుగా ఉన్నతీకరిస్తున్నారు. ఈ కొత్త ఏర్పాటులో భాగంగా రెండు ఎగ్జిక్యూటివ్ చైర్ కార్లు, 16 ఏసీ చైర్ కార్లు, రెండు డ్రైవర్ నడిపే కార్లతో సహా మొత్తం 20 ఆధునిక కోచ్‌లు ఉంటాయి. ఈ అదనపు కోచ్‌లు ప్రయాణీకులకు మరిన్ని సీట్లను, మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తాయి. రాజస్థాన్ నుండి ఢిల్లీకి ప్రయాణించే ప్రయాణీకులకు మెరుగైన అనుభవాన్ని అందిస్తూ, ఈ సూపర్‌ఫాస్ట్ రైలును మరింత ఆధునికంగా, సౌకర్యవంతంగా మార్చాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త కూర్పు రైలు సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి, సీట్ల లభ్యతను బాగా మెరుగుపరుస్తుంది.

**మే 24వ తేదీ నుంచి సాధారణ సర్వీసు ప్రారంభం:**

ప్రారంభ ప్రత్యేక రైలు తర్వాత ఈ రైలు కొత్త కోచ్‌ల కూర్పుతో సాధారణ సేవలను ప్రారంభిస్తుంది. మే 24, 2026 నుండి సాధారణ రైలు నంబర్ 26481/26482, జోధ్‌పూర్-ఢిల్లీ కంటోన్మెంట్-జోధ్‌పూర్ వందే భారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పూర్తి 20 కోచ్‌లతో తన కొత్త రూపంలో పట్టాలపై నడుస్తుంది. రైల్వే తీసుకున్న ఈ చర్యతో జోధ్‌పూర్ నుండి జైపూర్ మీదుగా ఢిల్లీకి ప్రయాణించే వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, పర్యాటకులు సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు కన్ఫర్మ్ సీటును పొందడంలో గొప్ప ఉపశమనం పొందుతారు.

## సన్‌రూఫ్‌లతో CNG కార్లు ధర కేవలం

## రూ.8.40 లక్షల నుంచే అదిరిపోయే మైలేజీ..!



సన్‌రూఫ్‌ల వంటి ప్రీమియం ఫీచర్లను అందించే మోడళ్లు ముఖ్యంగా ప్రాచుర్యం పొందాయి. అదృష్టవశాత్తూ భారత మార్కెట్ ఇప్పుడు బడ్జెట్‌కు అనుకూలమైన అనేక రకాల ఎంపికలను, ఫీచర్లను అందిస్తోంది. టాటా ఆల్ట్రోజ్, ఫ్యాక్టరీ-ఫిట్టెడ్ సీఎన్‌జీ, సన్‌రూఫ్‌ను అందించే భారతదేశపు.. ఈ రోజుల్లో కారు కొనుగోలుదారుల ప్రాధాన్యతలు గణనీయంగా మారాయి. వినియోగదారులు ఇకపై తక్కువ ఇంధన వినియోగం లేదా అధిక మైలేజీకి పరిమితం కావడం లేదు. వారు స్టైలిష్‌గా ఉండే, కుటుంబానికి సురక్షితమైన, ప్రీమియం ఫీచర్లను అందించే వాహనాన్ని కోరుకుంటున్నారు. ఈ కారణంగానే కార్లు వేగంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. సన్‌రూఫ్‌ల వంటి ప్రీమియం ఫీచర్లను అందించే మోడళ్లు ముఖ్యంగా ప్రాచుర్యం పొందాయి. అదృష్టవశాత్తూ భారత మార్కెట్ ఇప్పుడు బడ్జెట్‌కు అనుకూలమైన అనేక రకాల ఎంపికలను, ఫీచర్లను అందిస్తోంది. టాటా పంచ్ దేశంలోనే అత్యంత దృఢమైన, సురక్షితమైన మైక్రో ఎస్‌యూవీలలో ఒకటిగా పరిగణిస్తారు. దీని సీఎన్‌జీ వెర్షన్ ఇప్పుడు సన్‌రూఫ్‌తో అందుబాటులో ఉంది. ఇది దీనిని మరింత ఆకర్షణీయంగా చేస్తుంది. కంపెనీ ట్విన్-సిలిండర్ సీఎన్‌జీ టెక్నాలజీని ప్రవేశపెట్టింది. ప్యూర్ ప్లస్ వేరియంట్, అంతకంటే పై వేరియంట్లలో సన్‌రూఫ ఆప్షన్ అందుబాటులో ఉంది. దీని ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర సుమారు రూ.8.40 లక్షలు. మైలేజ్ పరంగా ఈ కారు సుమారు 27 కి.మీ/కేజీ మైలేజీని అందిస్తుంది. ఇది నగరం, హైవే వినియోగం రెండింటికీ చాలా మంచిదిగా పరిగణిస్తారు. టాటా ఆల్ట్రోజ్, ఫ్యాక్టరీ-ఫిట్టెడ్ సీఎన్‌జీ, సన్‌రూఫ్‌ను అందించే భారతదేశపు మొట్టమొదటి ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లలో ఒకటి. ఈ కారు 5-స్టార్ గ్లోబల్ ఎన్‌సీఏపీ సేఫ్టీ రేటింగ్‌కు కూడా ప్రసిద్ధి చెందింది. ఇది కుటుంబ కొనుగోలుదారులకు నమ్మకమైన ఎంపికగా నిలుస్తుంది. ఇది 1.2-లీటర్ పెట్రోల్ ఇంజన్ సీఎన్‌జీ-ట్యూన్డ్ వెర్షన్‌తో పనిచేస్తుంది. ఇది సుమారుగా 25 కి.మీ/కేజీ మైలేజీని అందించగలదు. దీని ధరలు సుమారుగా రూ.8.42 లక్షల (ఎక్స్-షోరూమ్) నుండి ప్రారంభమవుతాయి హ్యుందాయ్ ఎక్స్‌టెర్ ప్రస్తుతం సన్‌రూఫ్‌తో లభించే అత్యంత సరసమైన ఒకటి. దీని డిజైన్ దృఢంగా, ఆధునికంగా ఉంటుంది. అంతేకాకుండా వాయిస్-ఎనేబుల్డ్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్‌ను కలిగి ఉండటం దీనిని ప్రత్యేకంగా నిలుపుతుంది. ఇది 1.2-లీటర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది కేజీకి సుమారు 27 కిలోమీటర్ల మైలేజీని అందిస్తుంది. దీని ప్రారంభ ధర, ఎక్స్-షోరూమ్ సుమారుగా రూ.8.94 లక్షలు

## ఈ రైలుకు ఎందుకంత క్రేజ్

## నంబర్ 1 స్థానంలో కీలక విషయాలు!




గత సంవత్సరం ఏప్రిల్‌లో ఐఆర్‌సిటిసి మెయిల్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో టిక్కెట్ బుకింగ్ సమయంలో, ప్రయాణ సమయంలో కూడా ప్రయాణికులకు ఆహారం, తాగునీటిని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశాన్ని అందించడం ప్రారంభించింది. ఇది ఇంతకు ముందు అందుబాటులో లేని సౌకర్యం.. ప్రయాణికులు రైలులోనే భోజనం, పానీయాలు బుక్ చేసుకోగలిగే పాంట్రీ కార్లు ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మధ్యాహ్న భోజనానికే అత్యధిక ప్రాధాన్యత ఉంది. గత ఏడాది ఏప్రిల్‌లో 38 మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రారంభించిన ఈ సేవపై ఐఆర్‌సిటిసి ఒక అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఈ అధ్యయనంలో యశ్వంత్‌పూర్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో అత్యధిక సంఖ్యలో భోజనాలు బుక్ అయినట్లు తేలింది. ఏడాది క్రితం ఈ 38 రైళ్లలో ఈ సేవ ప్రారంభమైనప్పటి నుండి, ప్రయాణికులు 1,23,000 భోజనాలను బుక్ చేసుకున్నారు. మార్చి నెలలో అత్యధికంగా 19,934 భోజనాలు బుక్ అయినట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. అత్యధిక భోజన బుకింగ్‌లు ఉన్న రైళ్లలో బెంగళూరులోని యశ్వంత్‌పూర్, ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ మధ్య నడిచే వైపిఆర్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో అత్యధికంగా 12,629 భోజన ఆర్డర్లు నమోదయ్యాయి. ప్రయాణికులు బుక్ చేసుకున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనాలలో, అత్యధికంగా 42,179 బుకింగ్‌లు మధ్యాహ్న భోజనం కోసమే ఉన్నాయని కూడా ఈ సర్వేలో వెల్లడైంది.గత సంవత్సరం ఏప్రిల్‌లో ఐఆర్‌సిటిసి మెయిల్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో టిక్కెట్ బుకింగ్ సమయంలో, ప్రయాణ సమయంలో కూడా ప్రయాణికులకు ఆహారం, తాగునీటిని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశాన్ని అందించడం ప్రారంభించింది. ఇది ఇంతకు ముందు అందుబాటులో లేని సౌకర్యం. అస్సాంలోని దిబ్రూగఢ్ నుండి తమిళనాడులోని కన్యాకుమారి వరకు నడిచే దేశంలోనే అత్యంత సుదూర రైలు అయిన సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌తో సహా 38 రైళ్లతో ఈ సేవ ప్రారంభమైంది. దీని విజయంతో ఈ సేవను ఇప్పుడు 50 రైళ్లకు విస్తరించారు. ఇవన్నీ టిక్కెట్లు బుక్ చేసుకునేటప్పుడు ప్రయాణికులకు ఆహారం, పానీయాలను బుక్ చేసుకునే అవకాశం లేని రైళ్లు. దీనివల్ల, విక్రేతలు ఆహారం, తాగునీటిని అమ్మేటప్పుడు వీరా కంటే ఎక్కువ వసూలు చేస్తున్న సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి.

## బంగారం అద్భుతం చేసింది..

## కేవలం లక్ష రూపాయలు రూ.15 లక్షలుగా మార్చేసింది..!



ఫండ్స్‌ఇండియా ఇటీవల విడుదల చేసిన ఒక నివేదిక గత 20 నుండి 35 సంవత్సరాల డేటాను విశ్లేషించింది. ఈ నివేదికలోని ఆశ్చర్యకరమైన విషయాలు, పెట్టుబడిదారులు ఏకాగ్రతతో ఉండటం ద్వారా ఎలా కోటీశ్వరులు కాగలరో వెల్లడిస్తున్నాయి. గత 20 సంవత్సరాలుగా బంగారం పెట్టుబడిదారులను..గత 20 ఏళ్లుగా బంగారం అనూహ్యమైన పెరుగుదల పెట్టుబడిదారులను ధనవంతులను చేసింది. కేవలం రూ.1 లక్షను రూ.15 లక్షల భారీ ఫండ్‌గా మార్చింది. అయితే లాభాల పోటీలో రాబడుల విషయంలో బంగారాన్ని అధిగమించి, 17 రెట్లు రాబడులను అందించిన ఒక “సూపర్‌హిట్” ఆస్తి ఉంది. సాధారణంగా ప్రజలు ప్రమాదకరమని భావించి దూరంగా ఉండే ఈ ఆస్తి, నిశ్శబ్దంగా సంపద సృష్టిలో ఒక కొత్త చరిత్రను సృష్టించింది. బంగారం కాంతిని కూడా మించిపోయిన ఈ పెట్టుబడి సాధనం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఫండ్స్‌ఇండియా ఇటీవల విడుదల చేసిన ఒక నివేదిక గత 20 నుండి 35 సంవత్సరాల డేటాను విశ్లేషించింది. ఈ నివేదికలోని ఆశ్చర్యకరమైన విషయాలు, పెట్టుబడిదారులు ఏకాగ్రతతో ఉండటం ద్వారా ఎలా కోటీశ్వరులు కాగలరో వెల్లడిస్తున్నాయి. గత 20 సంవత్సరాలుగా బంగారం పెట్టుబడిదారులను ధనవంతులను చేసింది. నివేదికల ప్రకారం, బంగారం 14.6% ఆకట్టుకునే వార్షిక రాబడిని అందించింది. అంటే, 20 సంవత్సరాల క్రితం ఎవరైనా బంగారంలో రూ.100,000 పెట్టుబడి పెట్టి ఉంటే, ఈ రోజు దాని విలువ లక్షలాది రూపాయలు ఉండేది.

**20 నిమిషాల్లో ఛార్జ్.. 683 కి.మీ రేంజ్.. రూ.2 లక్షల డిస్కౌంట్..!**

అమెరికా స్టాక్ మార్కెట్ 20 ఏళ్లలో 17 రెట్లు లాభాన్ని చూసింది. అయితే బంగారం ధరలలో ఈ అనూహ్యమైన పెరుగుదల కూడా అమెరికా స్టాక్ మార్కెట్‌ను అధిగమించలేకపోయింది. అమెరికా మార్కెట్లు 20 ఏళ్లలో 15.2% వార్షిక రాబడిని అందించాయి. దీనితో రూ.1 లక్ష విలువ 17 రెట్లు పెరిగింది.

**భారత స్టాక్ మార్కెట్‌లో 35 ఏళ్లలో 86 రెట్ల లాభం:**

భారత స్టాక్ మార్కెట్ గురించి .. ఎన్నో ఒడిదుడుకులు, మాంద్యం ఎదురైనప్పటికీ, నిఫ్టీ 50 జూలై 1990 నుండి (దాదాపు 35 ఏళ్లుగా) ప్రతి సంవత్సరం సగటున 13.2% రాబడినిఇచ్చింది. ఈ వేగంతో 35 ఏళ్ల క్రితం పెట్టుబడి పెట్టిన రూ. 1 లక్ష ఈ రోజు రూ. 85 లక్షలు అయ్యింది. అంటే పెట్టుబడిదారుల డబ్బు దాదాపు 86 రెట్లు పెరిగింది. గత 20 ఏళ్లలో భారత స్టాక్ మార్కెట్ దాదాపు 11.4% వార్షిక రాబడిని ఇచ్చింది. దీని కారణంగా పెట్టుబడి 8.7 రెట్లు పెరిగింది. మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ కంపెనీలు అత్యధిక రాబడులను అందిస్తాయి. స్టాక్ మార్కెట్‌లో కూడా మిడ్-క్యాప్ కంపెనీలే ఆధిపత్యం చెలాయించాయి. మిడ్-క్యాప్ కంపెనీలు 20 ఏళ్లలో 14.6% వార్షిక రాబడులను అందించి, తమ సంపదను 15 రెట్లకు పైగా పెంచుకున్నాయి. స్మాల్-క్యాప్ కంపెనీలు 12.7% రాబడులను అందించి తమ సంపదను దాదాపు 11 రెట్లు పెంచుకున్నాయి. లార్జ్-క్యాప్ కంపెనీలు 11.8% రాబడులను అందించి, తమ సంపదను తొమ్మిది రెట్లు పెంచుకున్నాయి.

**ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రియల్ ఎస్టేట్ చాలా వెనుకబడి ఉన్నాయి:**

సురక్షితమైనవిగా భావించే సాంప్రదాయ పెట్టుబడులు ఈ పోటీలో చాలా వెనుకబడిపోయాయి. గత 20 ఏళ్లలో రియల్ ఎస్టేట్ కేవలం 7.9% వార్షిక రాబడిని మాత్రమే అందించింది. రుణ సాధనాల నుండి వచ్చే రాబడి కేవలం 7.5% నుండి 7.6%కి పరిమితమైంది.

**సహనమే కీలకం..**

స్టాక్ మార్కెట్‌లో స్వల్పకాలం (6 నెలల నుండి 3 సంవత్సరాల వరకు) పెట్టుబడి పెట్టడం ప్రమాదకరమని, నష్టాలకు కూడా దారితీయవచ్చని నివేదిక స్పష్టంగా పేర్కొంది. అయితే 7 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం భారత మార్కెట్‌లో ఉన్న పెట్టుబడిదారులు నష్టాల ప్రమాదాన్ని చాలా తక్కువగా ఎదుర్కొని, గణనీయమైన లాభాలను ఆర్జించారని చరిత్ర చూపిస్తోంది.

## పిల్లలకు నేర్పుదాం ఆర్థిక పాఠాలు..!

## ఈ స్మార్ట్ టిప్స్ మస్ట్‌గా చెప్పాలి..




పిల్లలకు చిన్నప్పుడే డబ్బు విలువ, పొదుపు, బాధ్యతాయుతగా ఖర్చు వంటి ఆర్థిక పాఠాలు నేర్పించడం ఎంతో అవసరం. తల్లిదండ్రుల ప్రవర్తన, ఇంట్లో జరిగే ఆర్థిక చర్చలు పిల్లల భవిష్యత్తు డబ్బు అలవాట్లపై కీలక ప్రభావం చూపుతాయి. చిన్న చిన్న ఆచరణాత్మక పాఠాల ద్వారా పిల్లలను ఆర్థికంగా స్వతంత్రులుగా తీర్చిదిద్దవచ్చు. ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందుల గురించి పిల్లలకు వారికి అర్థమయ్యేలా చెప్పాలి. ఈరోజుల్లో పిల్లలకు చదువుతో పాటు ఆర్థిక అంశాల మీద అవగాహన కూడా ఎంతో అవసరం. డబ్బు ఎలా సంపాదించాలి? ఎలా ఖర్చు పెట్టాలి? ఎలా పొదుపు చేయాలి? వంటి విషయాలను చిన్నప్పటి నుంచే నేర్పించాలి. అప్పుడే వారు భవిష్యత్తులో ఆర్థిక విషయాల్లో సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారు. ముఖ్యంగా ఈ విషయంలో తల్లిదండ్రుల ప్రవర్తనే పిల్లలకు మొదటి పాఠ్యపుస్తకం అవుతుంది. అందుకే ప్రతి ఇంట్లో చిన్న చిన్న ఆర్థిక పాఠాలు పిల్లలకు అలవాటు చేయడం చాలా ముఖ్యం.

1. ఆర్థిక పాఠాలు..త్వరగా ప్రారంభించండి

పిల్లలు చిన్న వయస్సులోనే డబ్బు విలువ అర్థమయ్యేలా చెప్పాలి. ఖర్చు, పొదుపు, అవసరం-ఆడంబరం మధ్య తేడా వంటి విషయాలను తల్లిదండ్రులు సాధారణ ఉదాహరణలతో చెప్పాలి. చిన్నప్పటి నుంచే డబ్బు పొదుపు చేయడం అలవాటు చేయాలి. అప్పుడే వారు డబ్బును జాగ్రత్తగా వినియోగించడం నేర్చుకుంటారు.

2. మాటల్లో కాదు చేతల్లో చూపండి..

మనం చెప్పే మాటల కంటే మనం చేసే పనులను పిల్లలు ఎక్కువగా గమనిస్తారు. తల్లిదండ్రులు మంచినీళ్ల ప్రాయంగా అవసరంలేని ఖర్చులు చేస్తే లేదా అప్పుల మీద జీవిస్తే పిల్లలు కూడా అదే అలవాట్లను అలవరుచుకునే అవకాశం ఉంటుంది. అలాగే దుబారా ఖర్చులకు దూరంగా ఉండటం, ముందుగా ప్లాన్ చేసుకోవడం, పొదుపు చేయడం వంటి మంచి అలవాట్లు పిల్లలపై సానుకూల ప్రభావం చూపుతాయి. ఆర్థిక క్రమశిక్షణకున్న పవర్ ఏంటో వారికి అర్థమయ్యేలా చేతల్లో చూపించాలి.

3. ఆర్థిక నిర్ణయాల్లో భాగస్వామ్యం చేయండి

కుటుంబ ఖర్చులతో పాటు ఇంట్లో నిర్వహించే చిన్న చిన్న ఈవెంట్ల బడ్జెట్ ప్లానింగ్ వంటి విషయాల్లో పిల్లలను కూడా చేర్చడం మంచిది. ఉదాహరణకు పుట్టినరోజు వేడుకకు ఎంత ఖర్చు చేయాలి? ఏవి అవసరం? ఏవి తగ్గించవచ్చు? వంటి విషయాలను వారితో చర్చించండి. ఇలా చేయడం వల్ల డబ్బును వృథా చేయకూడదని.. దాన్ని జాగ్రత్తగా ఉపయోగించాలనే అవగాహన వారికి వస్తుంది.

4. మీ ఇల్లే మొదటి ఆర్థిక పాఠశాల..

ఆర్థిక విషయ పరిజ్ఞానం పాఠశాల పుస్తకాలతో మాత్రమే రాదు. ఇంట్లోనే పిల్లలు నేర్చుకుంటారు. ఖర్చుల వివరాలను రాసిపెట్టుకోవడం.. సరైన నెలవారీ బడ్జెట్ అంశాల గురించి పిల్లలతో తప్పనిసరిగా చర్చించాలి. పొదుపు ఎందుకు చేయాలి? పొదుపు చేయకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక కష్టాలు? ఒక అవసరం కోసం మరొక కోరికను ఎలా వదులుకోవాలి? వంటి విషయాలను కుటుంబ సభ్యులు కలిసి మాట్లాడుకుంటే పిల్లల్లో బాధ్యత పెరుగుతుంది. ఆర్థిక విషయాల్లో పిల్లల అభిప్రాయాలను కూడా తీసుకుంటే.. వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

5. చివరి లక్ష్యం ఆర్థిక స్వాతంత్ర్యం

చిన్నప్పటి నుంచే సరైన ఆర్థిక అలవాట్లు నేర్చుకున్న పిల్లలు.. పెద్దయ్యాక మనీ విషయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. వారు అప్పుల బారిన పడకుండా, స్పష్టమైన లక్ష్యాలతో జీవించగలుగుతారు. దుబారా ఖర్చులకు దూరంగా పొదుపుపై దృష్టి పెట్టగలరు. ఆర్థిక స్వాతంత్ర్యం ఒక్కరోజులో రాదు. అది చిన్న చిన్న అలవాట్లతో ప్రారంభమవుతుంది. అందుకే తల్లిదండ్రులు పిల్లలకు డబ్బు గురించి నిజాయితీగా, ఆచరణాత్మకంగా చెప్పడం చాలా అవసరం.పిల్లలకు ఆర్థిక పాఠాలు నేర్పడం అనేది కేవలం డబ్బు గురించి చెప్పడం మాత్రమే కాదు.. బాధ్యత, ఆర్థిక ప్రణాళిక, స్వీయ నియంత్రణ వంటి విలువలను కూడా నేర్పించడం. చిన్న వయస్సులోనే సరైన ఆర్థిక అవగాహన కలిగిస్తే, వారు భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరమైన, ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తులుగా ఎదుగుతారు..

## ఒకటి కంటే ఎక్కువ పీఎఫ్ అకౌంట్లు ఉన్నాయా..?

## ఈ ఒక్క పని చేయకపోతే ఇబ్బందులే..



కొంతమంది తరచుగా ఉద్యోగాలు మారుతూ ఉంటారు. ఇలాంటి సమయంలో పీఎఫ్ అకౌంట్లను బదిలీ చేయడం మర్చిపోతుంటారు. ఇలా చేస్తే మీరు ఇబ్బందుల్లో పడే అవకాశముంటుంది. కొత్త కంపెనీలో చేరినప్పుడు పాత అకౌంట్‌ను తప్పనిసరిగా విలీనం చేసుకోవాలని ఈపీఎఫ్‌వో చెబుతంది. అదెలా చేయాలి అనేది చూద్దాం. కొంతమంది తరచుగా ఉద్యోగాలు మారుతుంటారు. ఇలాంటి సమయంలో ఒకటి కంటే ఎక్కువ పీఎఫ్ అకౌంట్లను కలిగి ఉంటారు. కంపెనీ మారినప్పుడు పాత అకౌంట్‌ను కొత్త కంపెనీ అకౌంట్లోకి మార్చుకోరు. కొత్త కంపెనీలో చేరిప్పుడు పాత పీఎప్ అకౌంట్‌ను కొత్త అకౌంట్లో విలీనం చేయడం అనేది అత్యవసరం. లేకపోతే మీరు చాలా నష్టపోవాల్సి ఉంటుంది. అలా చేసుకోకపోతే క్లెయిమ్, విత్ డ్రా సమయంలో ఇబ్బందులు పడే అవకాశముంటుంది. అసలు ఎలా పీఎఫ్ అకౌంట్లను విలీనం చేయాలి? స్టెప్ బై స్టెప్ ప్రాసెస్ ఇప్పుడు చూద్దాం.

కొత్త కంపెనీలో చేరారా..?

మీరు కంపెనీలు మారినప్పుడు మీ యూఏఎన్ నెంబర్‌తో మల్టీపుల్ మీ పీఎఫ్ అకౌంట్లు లింక్ చేసి ఉంటాయి. కొత్త కంపెనీలో చేరినప్పుడు ప్రత్యేక కొత్త మెంబర్ ఐడీ క్రియేట్ అవుతుంది. వీటిని మీరు విలీనం చేసుకోవాలి. పాత అకౌంట్లను కొత్త ఐడీలో విలీనం చేయాలి. దీని వల్ల పీఎఫ్ క్లెయిమ్, విత్ డ్రాలు వేగవంతంగా జరుగుతాయి. అంతేకాకుండా పీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ కూడా స్థిరంగా జమ అవుతూ ఉంటుంది. ఇంతేకాకుండా పెన్షన్ పొందేందుకు సర్వీస్ హిస్టరీ కూడా ఖచ్చితంగా ఉంటుంది.

ఎలా విలీనం చేయాలంటే..?

యూఏఎన్ పోర్టల్‌లోకి వెళ్లి యూఏఎన్ నెంబర్, పాస్ వర్డ్‌తో లాగిన్ అవ్వండి

ఆన్ లైన్ సర్వీసెస్ ట్యాబ్‌పై క్లిక్ చేయండి

ఒక సభ్యుడు-ఒకే పీఎఫ్ ఖాతా అనే ఆప్షన్ ఎంచుకోండి

మీ వ్యక్తిగత వివరాలు, పీఎఫ్ ఖాతాలను ధృవీకరించండి

మీ పాత పీఎఫ్ యజమాని వివరాలు చూడటానికి గెట్ డీటైల్స్‌పై క్లిక్ చేయండి

ధృవీకరణ కోసం ప్రస్తుత లేదా పాత యాజమానిని ఎంచుకోండి

సభ్యుని ఐడీ లేదా యూఏఎన్ నెంబర్ ఎంటర్ చేయండి

గెట్ ఓటీపీపై క్లిక్ చేయండి

మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీని క్లిక్ చేస్తే సరిపోతుంది

ఈమెయిల్ ద్వారా చేయడం ఎలా..?

ఖుఅవజూటఏవజూటఱఅఎఖు.స్త్రశీజ.ఱఅకు వివరాలు మెయిల్ చేయడం ద్వారా కూడా విలీనం చేసుకోవచ్చు. పాత యూఏఎన్ నెంబర్‌ను మూసివేయమని చెప్పండి. అనంతరం పీఎఫ్ సంస్థ మీ పాత అకౌంట్‌ను ఇనాక్టివ్ చేసి ఎస్ఎంఎస్ పంపుతుంది. ఇక మీరు పీఎఫ్ విలీనానికి సంబంధించి రిక్వెస్ట్ పెట్టుకున్నా స్టేటస్ చెక్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్‌వో పోర్టల్‌ను సందర్శించి ట్రాక్ క్లెయిమ్ స్టేటస్‌పై క్లిక్ చేయండి. ఇక్కడ పెండింగ్‌లో ఉన్న, ఆమోదించిన రిక్వెస్ట్ వివరాలు కనిపిస్తాయి. అయితే భవిష్యత్తులో ఆటోమేటిక్‌గా పీఎఫ్ అకౌంట్లు బదిలీ జరిగేలా కొత్త వ్యవస్థను ఈపీఎఫ్‌వో రూపొందిస్తోంది. త్వరలో కొత్త విధానం అమల్లోకి రానుంది.